క్లుప్తంగా

ఫిజియోథెరపీకి అధిక ప్రాధాన్యత

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్సర్ ప్రో వైస్ చాన్సలర్ బి.గీతాంజలి మాట్లాడుతూ వైద్య రంగంలో ఫిజియోథెరపీకి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల అనంతరం ఫిజియోథెరపీ తప్పనిసరి అయ్యిందన్నారు. క్రీడా రంగంలో సైతం ఫిజియోథెరపీ ప్రాధాన్యతను గుర్తించారని పేర్కొన్నారు.

అమ్మవారికి 108 పట్టు చీరలు



అమ్మవారి ముందు ఉంచిన 108 పట్టుచీరలు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది అష్టలక్ష్మి సన్నిధిలో శ్రావణమాస 4వ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణుల ముందు 108 పట్టు చీరలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీనారాయణ స్వామి వారిని వజ్ర కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తోమాల సేవ, శ్రీ లక్ష్మీ హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ప్రతి శ్రావణ మాసం 4వ వారం అమ్మవార్లకు 108 పట్టు చీరలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం 4వ శుక్రవారం పురస్కరించుకుని శ్రీవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచి వందలాది మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకు వెళ్లి, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఇస్కాన్‌లో ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామిని పట్టు వస్త్రాలు, వివిధ వర్ణాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని శ్రీకృష్ణ లీలలను భక్తులకు వివరించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

'జగనన్నకు చెబుదాం'లో వినతుల వెల్లువ

భూ వివాదాలపైనే ఎక్కువ వినతులు



జేసీకి సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ఆనందపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ మేరకు మండలంలో వివిధ పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలివచ్చి వినతులు సమర్పించారు.

- రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు రావాల్సిన టీడీ మొత్తాలు ఏడాది నుంచి పంచాయతీ ఖాతాలకు జమకావడం లేదని, దీంతో పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్‌లు బీఆర్‌బీ నాయుడు, బంక శ్రీను, మహంతి వెంకటలక్ష్మి తదితరులు విన్నవించారు.
- కుసులువాడ గుండం చెరువు కాలువ రక్షణ గోడ కూలిపోవడంతో 120 ఎకరాలకు సాగునీరు అందట్లేదని, దాని పునర్నిర్మాణానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. నిధులు విడదల కాకపోవడంతో పనులు జరగక, చెరువులోకి నీరు రావడంలేదని, తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి వినతి పత్రం అందించారు.
- తంగుడిబిల్లిలో 2020లో ల్యాండ్ పూలింగ్ కింద సాగు భూములను ప్రభుత్వానికి అందించారని, పరిహారం కింద ఇచ్చిన పట్టా భూములకు రిజిస్ట్రేషన్లు అవ్వట్లేదని పైడిరాజు తదితర రైతులు మొరపెట్టుకున్నారు.
- గిడిజాల సర్వే నెం.258లో గల భూములు కోర్టు కేసుల వలన సుమారు 200 మంది పేదలకు స్థలాలు అందలేని పరిస్థితి. అక్కడే సర్వే నెం .256, 257లలో గల భూములను రైతులు జగనన్న కాలనీ లే అవుట్‌లకు అప్పగించారు. స్థలాలు అప్పగించిన వారే ఇల్లు కట్టుకుంటే కొంత మంది తప్పుడు ఫిర్యాదులు వలన అధికారులు కూల్చివేస్తున్నారని సర్పంచ్ షిణగం అప్పలరాజు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను తదితరులు ఫిర్యాదు చేశారు.
- ముచ్చర్ల పంచాయతీ, గొంపవానిపాలెంలో పాఠశాల భవనం శిథిలం కావడంతో ఐదేళ్ల నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, వెంటనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గొంప సన్యాసిరావు, గ్రామస్తులు కోరారు.
- ఎస్సీ బాలికల హాస్టల్ రోడ్డు పూర్తిగా శిథిలమైందని, బంటుబిల్లి కళ్లాలలో రోడ్డు అసంపూర్తిగా ఉండిపోయిందని చర్యలు తీసుకోవాలని కోరుతు నాగరాజు, శ్రీను స్థానికులు విన్నవించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సూరినాయుడు

పద్మనాభం: రైతులందరితో ఈ-క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు తాలాడ సూరినాయుడు అన్నారు. పద్మనాభంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తను సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసేలా చూడాలని, సిబ్బందికి సూచించారు. పద్మనాభం యూనియన్ బ్యాంకు మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ పంటలపై రైతులకు, కౌలు రైతులకు అందిస్తున్న రుణాల గురించి వివరించారు. స్థానిక పశు వైద్యాధికారి కె.మహేష్ మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం, విద్యుత్ జేఈ రమేష్ పాల్గొన్నారు.

సాంకేతికతతో విద్యార్థుల ఉన్నతికి మెరుగులు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఘనశ్యామ్

పీఎం పాలెం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని శాస్త్రవేత్త జీసీ ఘనశ్యామ్ అన్నారు. సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో 21వ బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆళ్వార్ దాస్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్ దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుభట్, ప్రిన్సిపాల్ అనీల్, కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రావణ లక్ష్మికి కుంకుమ పూజలు



మారికవలస ఆర్‌జీకే కాలనీ గణపతి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న ముత్తయిదువులు



చంద్రంపాలెం దుర్గాలమ్మ సన్నిధిలో కోలాట బృందం

మధురవాడ: శ్రావణ మాసం 4వ శుక్రవారాన్ని పురస్కరించుకుని మధురవాడ పరిసర ప్రాంతాల్లో అమ్మవార్లకి కుంకుమ పూజలు నిర్వహించారు. మారికవలస ఆర్‌జీకే కాలనీలోని శ్రీ విజయ గణపతి ఆలయం ఆవరణలోని ఉమా మహేశ్వరి అమ్మవారి సన్నిధిలో 108 మంది ముత్తయిదువులు కుంకుమ పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి వైభవ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. చంద్రంపాలేనికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ కోలాట బృందం కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పీస రామారావు, సత్యన్నారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పిల్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పోతిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

810 హెక్టార్లలో ఖరీఫ్ పంట నమోదు



రైతు సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఏవో శివకోమలి

తగరపువలస: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు 810 హెక్టార్లలో రైతులు వేశారని, వాటిని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో ఇ-క్రాప్ నమోదు చేసినట్టు భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. శుక్రవారం భీమిలి వ్యవసాయాధికారి కార్యాలయంలో జరిగిన మండల స్థాయి రైతు సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. పంట నష్టాల సమయంలో పరిహారం, వ్యవసాయ ఉపకరణాలు సబ్సిడీపై పొందడానికి, వ్యవసాయ రుణాలకు తప్పనిసరిగా రైతులు పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 40 శాతం రాయితీతో డ్రోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎ.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం ద్వారా యంత్ర పరికరాలు తీసుకున్న రైతులు సకాలంలో వాయిదాలు తిరిగి చెల్లించాలన్నారు. నిబంధనల మేరకు పంట రుణాలు రూ.3 లక్షల వరకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. స్వల్ప కాలిక రుణాలు రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు ఇస్తున్నామన్నారు. ఉద్యానవన శాఖాధికారి స్వాతి మాట్లాడుతూ 90 శాతం రాయితీతో అందిస్తున్న బిందు సేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో భీమిలి ఎంపీడీవో పి.వెంకటరమణ, మండల ఏఈ రాజేష్ పట్నాయక్, ఆర్బీకే సిబ్బంది భవన ప్రత్యూష, కృపామణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



మధురవాడలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మధురవాడ: ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం జీతాలు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎస్.పద్మను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు వి.తులసిరామ్ అన్నారు. మేనేజ్‌మెంట్ కక్ష సాధింపు చర్యను వ్యతిరేకిస్తూ మధురవాడ ఆర్టీసీ డిపో వద్ద సీఐటియూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఆర్టీసీ నిర్ణయించిన జీతాలు ఇవ్వకపోయినా మేనేజర్ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిపో మేనేజర్ ఉమా మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.అప్పలరాజు, కొండమ్మ, రాజ్‌కుమార్, ఆర్టీసీ డిపో నాయకులు బీఎస్ నారాయణ, భాస్కరరావు, ఎస్.పద్మ, పి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గదులతో మెరుగైన బోధన



డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న భారత్ డైనమిక్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు

తగరపువలస: తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ పరికరాలను వినియోగించుకుని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భారత్ డైనమిక్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో తమ సంస్థ సమకూర్చిన డిజిటల్ తరగతి గదులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, భీమిలి డైట్ లెక్చరర్ గొట్టేటి రవి, డిజిటల్ తరగతి గదుల ప్రాజెక్ట్ నిర్వహణ కో ఆర్డినేటర్ రవీంద్ర, హెచ్ఎం మురళీమోహనరావు, సమగ్రశిక్ష ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధికి మూలం అక్షరాస్యత

పలు చోట్ల అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీలు



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వర్మ

తగరపువలస: నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చడానికి గ్రామీణ ప్రాంతాలలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వర్మ అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భీమిలి డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి మాట్లాడుతూ అక్షరాస్యతలో మన దేశం ప్రపంచంలో 160వ స్థానంలో ఉండి, జాతీయ అక్షరాస్యత కంటే మన రాష్ట్రం వెనుకంజలో ఉందన్నారు. ప్రతి అక్షరాస్యుడు తమ కుటుంబంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. పీపీసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో చదువుకునే వారి సంఖ్య పెరుగుతుంటే, గ్రామీణప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఇంకా ఉన్నారని, ఆ సంఖ్య తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.మురళీమోహనరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట విద్యార్థుల ర్యాలీ

ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. నిరక్షరాస్యత వలన కలిగే అనర్థాలను వివరిస్తూ నాటక ప్రదర్శన చేశారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు, ఉపాధ్యాయులు ఎస్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి పాల్గొన్నారు.

- కుటుంబం అంతా చదువుకోవడం వలన సమాజం, తద్వారా దేశమంతా అక్షరాస్యులవుతారని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి, భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. 56వ ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం హిందీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ చదువుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

భీమునిపట్నం: అక్షరాస్యత మెరుగ్గా ఉంటేనే ఎక్కడైనా అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డైట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. ఎక్కడైతే అత్యుత్తమ విద్యా విధానం, అక్షరాస్యత ఉంటుందో.. ఆ దేశం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అలాంటి దేశాలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుంటాయని పేర్కొన్నారు. మనదేశం ఒకప్పుడు బాగా వెనుకబడిన దేశంగా చెప్పబడేదని, ఇప్పుడు అక్షరాస్యత పెరుగుతుండటంతో అభివృద్ధిలో కూడా ముందుకు వెళుతున్నామన్నారు. ఇక్కడ ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొంది, ఉపాధ్యాయులుగా బాధ్యత చేపట్టాక విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు మహాలక్ష్మి, త్రినాథరావు, హరిణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అశాంతికి తండ్రీ కొడుకుల కుట్ర



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఐటీ నోటీసులపై చంద్రబాబు స్పందించాలి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: తండ్రీ కొడుకు(చంద్రబాబు, లోకేష్) లిద్దరూ కలిసి రాష్ట్రంలో హింసను ప్రేరేపించి, అశాంతి సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 8వ వార్డు పరిధి పాత మధురవాడలో రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని కుటుంబాల వారీ గణాంకాలతో సహా వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించి, ఇంకా ఎవరైనా అర్హులై ఉండీ సంక్షేమ పథకాలను అందుకోకపోతే తక్షణమే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయం పరిధిలో పలు అభివృద్ధి పనులకు రు.20 లక్షలు మంజూరు చేస్తున్నామని, స్థానికుల అభ్యర్థన మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే వేరే చోటుకు తరలిస్తామన్నారు. తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వివక్షకు తావులేని పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని అభ్యర్థించారు. గత ప్రభుత్వం కంటే జగన్ పాలనే బాగుందని స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో అల్లర్లు సృష్టించడం, వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టడం, చివరకు పోలీసులపై దాడికి పురిగొల్పుతూ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వారు ఎన్ని కుట్రలు చేసినా, ఎందరు కలసి వచ్చినా రానున్న ఎన్నికల్లో అధికారం వైఎస్సార్‌సీపీదేనన్నారు.

ఐటీ శాఖ నోటీసులపై చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. అమరావతి కాంట్రాక్టుల విషయంలో లంచాలు తీసుకుని పట్టుబడ్డా, సానుభూతి కోసం అడ్డగోలుగా మాట్లాడుతున్న చంద్రబాబును ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేశ్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ ఇన్‌చార్జి ఉప్పులూరి గోపి, చెన్నా దాసు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, మహిళా అధ్యక్షురాలు మజ్జాడ జ్యోతిర్మయి, ఎంవీ రమణమూర్తి, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, ఆర్ఐ మల్లేశ్వరరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈలు శ్రీధర్, సూర్యప్రకాష్, ఏపీడీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట్ సేవా పతకం

మరి కొంతమందికి కూడా..

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మకు ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలా రావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జీ.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎస్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎస్.బి.వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంవీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ

రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



ప్రసాద్ స్కీమ్ పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తిస్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలన్నారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్-5 కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. టూరిజం శాఖ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నెమలిపురి



సత్యనారాయణను అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తగరపువలస: ఏయూ ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థి డాక్టర్ నెమలిపురి సత్యనారాయణకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఈ మేరకు శుక్రవారం నగరంలోని పోర్ట్ ట్రస్ట్ అతిథిగృహంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆయన్ని అభినందించారు. 'ప్రిజన్ రైటింగ్ డ్యూరింగ్ ఎమర్జెన్సీ ఇన్ ఇండియా-ఎ స్టడీ' అనే అంశంపై పరిశోధనకు ఇటీవల ఏయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ పరిశోధన సామాజిక బాధ్యత కలిగిన చర్యగా భావించి గతంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. ఇపుడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. ఈయన అనిట్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.